ఢిల్లీకి గూడూరు నిమ్మ..

- గతంలో తీవ్ర వర్షాభావంతో అన్నదాతల ఉక్కిరిబిక్కిరి
- గత మూడేళ్లుగా సమృద్ధిగా కురుస్తున్న వర్షాలు
- కోలుకుంటున్న నిమ్మరైతులు
- ఢిల్లీకి ఎగుమతి అవుతున్న పసినిమ్మ

దేశ రాజధాని ఢిల్లీకి గూడూరు పసినిమ్మ ఎగుమతి అవుతోంది. ఈ నెల రెండోవారం నుంచే నిమ్మధరలు ఆశాజనకంగా ఉండడంతో రైతన్నల కళ్లలో ఆనందం కనిపిస్తోంది. సీజన్ మాసాలైన మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది. గతేడాది నిరవధికంగా నిమ్మ ధరలు బాగుండడంతో రైతులు ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. ఈ ఏడాది కూడా అదే తరహాలో ధర పలికితే కష్టాల కడలి నుంచి ఒడ్డుకు చేరతామని నిమ్మ రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



నిమ్మకాయలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు





మార్కెట్‌కు చేరిన నిమ్మకాయల బస్తాలు, ఎగుమతి చేసేందుకు సిద్ధం చేసిన నిమ్మకాయలు

గూడూరు: గత కొన్నేళ్లుగా ధరలు లేక నిమ్మసాగు చేసిన రైతన్నలు అప్పుల ఊబిలో కూరకుపోయా రు. అలాగే తీవ్ర వర్షాభావంతో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో చెట్లను కాపాడుకోవడానికి చాలా ఇబ్బందులు పడ్డారు. ఈక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక సమృద్ధిగా వర్షాలు కురిశాయి. అయినప్పటికీ కరోనా మహమ్మారి కారణంగా రెండేళ్లపాటు కొంతమేర ఇబ్బందులకు గురైనా, ప్రభుత్వం ఆదుకోవడంతో కొంతమేర నిలదొక్కుకున్నారు. అలాగే గతేడాది సీజన్, అన్‌సీజన్ అనే తేడా లేకుండా నిమ్మ ధరలు బాగా పలకడంతో రైతన్నలు కోలుకోగలిగారు. ఈ ఏడాది ఇంకా సీజన్ మొదలవక ముందే నిమ్మ ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. లూజు నిమ్మకాయల బస్తా ధర సోమవారం స్థానిక మార్కెట్‌లో రూ.6 వేలు పలికింది.

17 వేల ఎకరాల్లో సాగు..

ఉమ్మడి జిల్లాలోని మెట్ట ప్రాంతాలైన గూడూరు, పొదలకూరు, వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి, సైదాపురం, కలువాయి, ఓజిలి, చిల్లకూరు తదితర మండలాల్లో సుమారు 17 వేల హెక్టార్లలో నిమ్మ పంట సాగులో ఉంది. మొక్క నాటిన నాటి నుంచి ఐదేళ్లపాటు రైతన్నలకు నిమ్మతోట నుంచి ఎలాంటి ఫలసాయం రాదు. దీనికితోడు నిమ్మ సాగుకు పెట్టుబడులు కూడా అధికమే. అయితే గతంలో కొన్నిసార్లు నిమ్మకు మంచి డిమాండ్ ఉండే మార్చి, ఏప్రిల్, మే నెలల్లో కూడా కనీస ధరలు లేక రైతులు తీవ్ర నష్టాలపాలయ్యారు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలోనే ధరలు పలుకుతుండడంతో రానున్న రోజుల్లో ధరలు మరింత పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కష్టాలు తీరినట్లే..



గతంలో తోటల్లో కాయలుంటే ధరలు ఉండేవి కాదు. ధరలున్నప్పుడు కాయల్లేక లాభాలు చూసే పరిస్థితి లేకుండా పోయింది. అయితే గతేడాది ఫిబ్రవరి నుంచి ఏడాది పొడవునా ధరలు బాగా పలికాయి. దీంతో కొంతమేర అప్పులు తీర్చగలిగాం. ఈ ఏడాది కూడా ఫిబ్రవరిలోనే ధరలు బాగ పలుకుతున్నాయి. ఇలాగే ఉంటే నిమ్మ రైతుల కష్టాలు తీరినట్లే.

–భాస్కర్‌రెడ్డి, కొండాగుంట

అప్పుల బాధలు ఉండవు



గత ఏడాది లాగే, ఈసారి కూడా నిమ్మకాయల ధరలు బాగా పలుకుతాయనిపిస్తోంది. ఫిబ్రవరి మొదటి వారం నుంచే ధరలు ఊపందుకున్నాయి. రానున్న సీజన్‌లో నిమ్మ ధరలు పెరిగే అవకాశం ఉంది. ఇలాగే ధరలు ఉంటే మాత్రం నిమ్మ రైతులకు అప్పుల బాధలు ఉండవు.

–వసంత్‌రెడ్డి, మంగళపూరు

క్లుప్తంగా

నేడు గృహసారథులతో సమావేశం

ఓజిలి: మండలంలో కొత్తగా ఎంపికైన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు మంగళవారం ఉదయం ఓజిలి పంచాయితీ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జేసీఎస్ మండల కన్వీనర్ షేక్ ఖాదర్‌బాషా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పాల్గొని వారికి దిశానిర్దేశం చేస్తారన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

సైదాపురం: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలను సోమవారం ఎంపీడీఓ వెంకటేశ్వర్లు పరిశీలించారు. మండల కేంద్రం సైదాపురంలోని ఉన్నత పాఠశాలలో పట్టభద్రులు, ఉపాధ్యాయులకు సంబంధించిన ఏర్పాటు చేయనున్న మూడు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే నెలలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నిలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన స్థానిక సచివాయాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు కోరారు.

బాధితురాలికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న గౌడసంఘం నాయకులు

గూడూరు: గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న కె.లక్ష్మి అనే మహిళకు వైద్య ఖర్చుల నిమిత్తం గౌడసంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో గౌడ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చిట్టెం శ్రీనివాసులు మాట్లాడుతూ లక్ష్మి అనారోగ్యంతో గూడూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోందని తెలిపారు. ఈ మేరకు ఆమె ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో, గౌడసంఘం ముందుకు వచ్చి ఆమెకు రూ.31 వేలను అందజేశారు. కార్యక్రమంలో రఘుగౌడ్, శివకుమార్ గౌడ్ ఉన్నారు.

తాపీమేస్త్రీలకు అవగాహన



మాట్లాడుతున్న టెక్నికల్ ఇంజనీర్ రామ్‌ప్రసాద్

వాకాడు: భవనాలు నిర్మించేటప్పుడు ఏ పనికి ఏ రకం సిమెంట్ అవసరమో దానినే తయారు చేస్తున్నట్లు రామ్‌కో సిమెంటు టెక్నికల్ ఇంజినీర్ రామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం వాకాడు మసీదువీధిలో రామ్‌కో సిమెంటు రకాలు, నాణ్యతపై తాపీ మేస్త్రీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సేల్స్ మేనేజర్ కిషోర్‌కుమార్‌రెడ్డి, వాకాడు ఏజెంట్ సందాని బాషా తదితరులు పాల్గొన్నారు.

బాలిక మృతిపై ఫిర్యాదు

నాయుడుపేటటౌన్: మండల పరిధిలోని తిమ్మాజికండ్రిగ గ్రామానికి చెందిన బత్తిన వెంకట్రామణ, రమణమ్మ కుమార్తె అలేఖ్య జనవరి నెల 14వ తేదీ నాడు ఉదయం ఇంటి వద్ద భోగి మంటలు వేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. దీంతో మంటల్లో కాలి తీవ్రంగా గాయపడిన బాలికను నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో చెన్నైలోని ఆస్పత్రికి తరలించారు. అయితే సోమవారం సాయంత్రం అలేఖ్య పరిస్థితి విషమించి మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా, సీఐ ప్రభాకర్‌రావు కేసు నమోదు చేశారు. మంగళవారం చెన్నై ఆస్పత్రికి సిబ్బందిని పంపి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని సీఐ తెలిపారు.

సీనియర్ సివిల్ కోర్టు ఏర్పాటు చేయాలని వినతి

నాయుడుపేటటౌన్: నాయుడుపేట జూనియర్ సివిల్‌కోర్టులో సీనియర్ సివిల్ కోర్టు ఏర్పాటుకు హైకోర్టు అనుమతులు ఇవ్వాలని కోరుతూ స్థానిక న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెందోటి పార్థసారథి రెడ్డి సోమవారం తహసీల్దారు రాజేంద్రకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూడలి ప్రాంతంగా ఉన్న నాయుడుపేటకు సమీపంలోనే సూళ్లూరుపేట, కోట, వెంకటగిరి కోర్టులు ఉన్నాయని అందువల్ల నూతన భవనాలు కలిగిన నాయుడుపేటలో సీనియర్ సివిల్ కోర్టు ఏర్పాటు చేస్తే బాగుంటుందని తెలిపారు. ఈ విషయమై ఇటీవల నాయుడుపేట కోర్టుకు వచ్చిన జిల్లా జడ్జికి కూడా వినతిపత్రాన్ని అందించినట్లు చెప్పారు. ఈ విషయంపై తహసీల్దార్ స్పందిస్తూ బార్ అసోసియేషన్ వినతిని హైకోర్టుకు పంపుతామని హామీ ఇచ్చినట్లు పార్థసారథిరెడ్డి తెలిపారు. ఆయన వెంట పలువురు న్యాయవాదులు ఉన్నారు.

ఆధార్ అనుసంధానం తప్పనిసరి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ గిరిబాబు

చిల్లకూరు: ఉపాధిహామీ పథకం కింద చేపట్టే పనులకు వచ్చే కూలీలు తప్పనిసరిగా ఆధార్ అనుసంధానం చేయించుకోవాలని ఉపాధి ఏపీఓ గిరిబాబు సూచించారు. మండలంలోని ఉడతావారిపాళెం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం ఏపీఓ గిరిబాబు పరిశీలించి కూలీల మస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం ఆయన కూలీలతో మాట్లాడుతూ మండలంలో అత్యధికంగా కూలీలు హాజరయ్యే గ్రామాల్లో ఉడతావారి పాళెం ఒకటని దీన్ని, దృష్టిలో ఉంచుకుని జాబ్‌కార్డు ఉండి, అందులో ఉన్న ప్రతి కుటుంబ సభ్యులు తమ ఆధార్‌ను జాబ్‌కార్డుకు అనుసంధానం చేసుకోవాలని సూచించారు. నగదు చెల్లింపుల విషయంలో ఎలాంటి పొరపాట్లు లేకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ క్షేత్ర సహాయకుల దగ్గర తమ ఆధార్ కార్డులను అందించి అనుసంధానం చేయించుకోవాలని సూచించారు. ఆయన వెంట ఉపాధి సిబ్బంది ఉన్నారు.

జీవితాంతం జగనన్నకు రుణపడి ఉంటా



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న మేరిగ మురళీధర్

గూడూరు: తన సేవలను గుర్తించి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం విధేయుడిగా ఉంటానని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి మేరిగ మురళీధర్ తెలిపారు. స్థానిక సంస్థల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మేరిగను ప్రకటించడంతో, ఆయన తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సోమవారం కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం క్రమశిక్షణతో కష్టపడి పని చేస్తే, గుర్తింపు దానంతట అదే వస్తుందని తెలిపారు.

వైభవంగా నాగేశ్వరస్వామి కల్యాణోత్సవం



కల్యాణోత్సవ క్రతువు నిర్వహిస్తున్న వేద పండితులు

సూళ్లూరుపేట: పట్టణంలోని నాగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి శివపార్వతుల కల్యాణోత్సవాన్ని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సహకారంతో కనుల పండువగా నిర్వహించారు. ఉభయకర్తలు ఆలయ చైర్మన్ చెన్నారెడ్డి సుబ్రమణ్యంరెడ్డి, ఉషారాణి దంపతుల ఇంటి నుంచి పట్టువస్త్రాలు, సారెను కల్యాణ వేదిక వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. వాకాటి నారాయణరెడ్డి–లక్ష్మీగీత దంపతుల ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. శివపార్వతుల కల్యాణం సందర్భంగా చాలా మంది జంటలు వివాహం చేసుకోగా, వారికి గ్రామస్తులతో కలిసి స్వామిరెడ్డి దంపతులు పట్టువస్త్రాలు, తాళిబొట్లు అందజేశారు. దయాకర్‌రెడ్డి, మధుకుమారి ఉభయకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఈఓ మమత, ప్రధాన అర్చకులు సునీల్‌కుమార్‌శర్మ, మాజీ చైర్మన్ వేనాటి మునికృష్ణారెడ్డి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

జగనన్న గోరుముద్ద తనిఖీ

దొరవారిసత్రం: మండలంలోని ఏకొల్లు గ్రామ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్ద భోజన పథకాన్ని సోమవారం స్థానిక ఎంఈఓ మస్తానయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. అదేవిధంగా గుడ్లు స్టాక్, భోజనం పథకం తయారీని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నారా ? లేదా అని ఆరా తీశారు. ఆయన వెంట హెచ్‌ఎం ముత్తుస్వామి ఉన్నారు.

సామాజిక న్యాయంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న జడ్జి అశోక్‌కుమార్

గూడూరు: సామాజిక న్యాయంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి అశోక్‌కుమార్ తెలిపారు. స్థానిక రెండవ పట్టణంలోని కోర్టు ఆవరణలో సోమవారం ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయం పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణపై ఫిర్యాదు

వెంకటగిరి: పట్టణంలోని సర్వే నంబర్ 218లో 0.74 సెంట్లు, 219–1లో ఉన్న 0.45 సెంట్లు, కుమ్మరిగుంట సర్వేనంబర్ 175లో 10 సెంట్లు భూమి ఆక్రమణలకు గురైనట్లు ఏపీ ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ మునెయ్య వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన సోమవారం మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్యకు ప్రభుత్వ స్థలాల ఆక్రమణపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని కోరారు. ఈ ఆక్రమణలపై గతంలో జిల్లా కలెక్టర్‌కు స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

భూపంపిణీ చేయాలని వినతి

ఓజిలి: మండల పరిధిలోని కుందాం రాచపాళెం గ్రామంలో నివాసం ఉంటున్న గిరిజనులకు ప్రభుత్వం భూములను మంజూరు చేయాలని తహసీల్దార్ లాజరస్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా తాము జీవనోపాధి కోసం చుట్టుపక్కల ప్రాంతాలకు వెళ్తున్నామని, అలాకాకుండా గ్రామసమీపంలో ప్రభుత్వ భూములను ఇస్తే పంటలు పండించుకుని జీవనం సాగిస్తామని తెలిపారు. గ్రామంలో సర్వే చేయించి అర్హులైన పేదలకు భూములు ఇచ్చేలా కృషి చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

వెంకటగిరి: మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యం లోపించకుండా ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య తెలిపారు. పట్టణంలోని 14వ వార్డులో ఆయన వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్యతో కలిసి సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుద్ధ్యం లోపిస్తే ప్రజలు రోగాలబారిన పడతారని, స్థానికులు సైతం రోడ్లపై చెత్త వేయకుండా పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వెంకటరత్నం రాజు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ వెంకటేశ్వర్లుకు ఘన సన్మానం



వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న ఎంపీపీ తనుజారెడ్డి, చైర్‌పర్సన్ భానుప్రియ, ఉపాధ్యాయులు

వెంకటగిరిరూరల్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం స్కూల్‌కాంప్లెక్స్ ఎంపీయూపీ బంగారుపేట, ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఎంఈఓగా పురస్కారం అందుకున్న వెంకటగిరి ఎంఈఓ వెంకటేశ్వర్లును కార్యక్రమ ముఖ్యఅతిథి వెంకటగిరి ఎంపీపీ తంబిరెడ్డి తనుజారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న ఎంఈఓ వెంకటేశ్వర్లు అభినందనీయులని కొనియాడారు. భవిష్యత్తులో విద్యారంగంలో మరిన్ని సేవలు అందించి పురస్కారాలు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కరీముల్లా, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నక్కా వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు నారాయణ, పూజారి లక్ష్మి, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ఎంపీ నారాయణ, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ యజమానుల నిరసన

గూడూరురూరల్: మండల పరిధిలోని ఓ పరిశ్రమ యాజమాన్యం పనులు చేయించుకుని నగదు చెల్లించకుండా తిప్పుకుంటున్నారని ట్రాక్టర్ యజమానులు సోమవారం పరిశ్రమ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ గేట్ వద్ద కార్మికులను పనులకు వెళ్లకుండా వారు అడ్డుకున్నారు. తమకు నగదు చెల్లించకుండా వెళ్లిపోయిన సబ్ కాంట్రాక్టర్‌తో నగదు ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీలో పనులు పూర్తయ్యే వరకు తమ ట్రాక్టర్లను వినియోగించుకున్న సబ్ కాంట్రాక్టర్ సుమారు రూ.30 లక్షలు డబ్బు ఇవ్వకుండా పత్తాలేకుండా పోయాడని ఆరోపించారు. రూరల్ సీఐ దశరథరామారావు ట్రాక్టర్ యజమానులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో వారు నిరసన విరమించారు.

ఓపెన్ అథ్లెటిక్ పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ



పతకాలు సాధించిన ఎన్ఎస్ఎఫ్ క్రీడాకారులు

నాయుడుపేటటౌన్: తమిళనాడు రాష్ట్రంలోని చెన్నై నెహ్రూ ఇంటర్నేషనల్ స్టేడియంలో సోమవారం పలు విభాగాల్లో జరిగిన ఓపెన్ అథ్లెటిక్ పోటీల్లో నాయుడుపేట ఎన్ఎస్ఎఫ్(నాయుడుపేట స్పోర్ట్స్ ఫెడరేషన్) క్రీడాకారులు ప్రతిభ చూపి పతకాలు సాధించినట్లు ఎన్ఎస్ఎఫ్ వ్యవస్థాపకులు మోమిడి లక్ష్మయ్య తెలిపారు. అండర్–14 బాలుర విభాగంలో వరుణ్‌సందేశ్, వీరరాఘవులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. బాలికల విభాగంలో మోక్ష ప్రథమస్థానంలో నిలిచినట్లు చెప్పారు. అండర్–12 బాలుర విభాగంలో సిద్ధార్థ ద్వితీయస్థానంలో నిలిచినట్లు తెలిపారు. అండర్–10 బాలుర, బాలికల విభాగాల్లో మూడవ స్థానంలో మహీధర్, మయూరి నిలిచారన్నారు. వీరికి పతకాలతో పాటు నగదు బహుమతులు, మెడల్స్, మెమెంటోలను అందించినట్లు లక్ష్మయ్య తెలిపారు. చెన్నైలో జరిగిన ఓపెన్ అథ్లెటిక్ పోటీల్లో పతకాలు, నగదు బహుమతులు సాధించిన క్రీడాకారులను స్థానిక ఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు సుదీప్ రెడ్డి, శ్రీహరి, పలువురు అభినందించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించం



సచివాలయంలో తనిఖీ చేస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

నాయుడుపేటటౌన్: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించమని కమిషనర్ శ్రీనివాసరావు హెచ్చరించారు. సోమవారం ఆయన పట్టణంలోని బేరిపేట సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ పరిధిలో ఇప్పటివరకు అందించిన సేవలు, వచ్చిన అర్జీలు, పరిష్కరించిన వాటితో పాటు ఇతర రికార్డులను పరిశీలించారు. ముఖ్యంగా సచివాలయ పరిధిలో ఇంటి పన్నులు ఎంతవరకు వసూలు చేశారన్న విషయంపై ఆరా తీశారు. జగనన్న ఇంటి నిర్మాణాలను ఇప్పటివరకు మొదలు పెట్టని వారిని గుర్తించి, తోడ్పాటు అందించాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టి సారించి పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు

నేదురుమల్లి సేవలు ఎనలేనివి



రక్తదానం చేస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి

- తిరుపతి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి
- మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన

కోట: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తామని నేదురుమల్లి ఫౌండేషన్ చైర్మన్, ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థల కరస్పాండెంట్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం విద్యానగర్‌లో నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళాభవన్‌లో నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా జనార్దన్ రెడ్డి చిత్రపటానికి రామ్ కుమార్‌రెడ్డి స్థానిక నేతలు, విద్యాసంస్థల సిబ్బంది నివాళులర్పించారు. అనంతరం నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి స్వయంగా రక్తం ఇచ్చి మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు కొడవలూరు ధనుంజయరెడ్డి, కొడవలూరు భక్తవత్సల్ రెడ్డి, దేవారెడ్డి నాగూర్‌రెడ్డి, మండల కన్వీనర్ సంపత్‌కుమార్‌రెడ్డి, ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

తిరుపతిని మొదటి స్థానంలో నిలబెడతా..

వాకాడు: రానున్న ఎన్నికల్లో తిరుపతి జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉంచడమే తన లక్ష్యమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం వాకాడులో జరిగిన దివంగత మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి 88వ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన భారీ కేక్ కట్ చేశారు.

వెంకటగిరిలో..



నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి: దివంగత ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి జయంతిని స్థానిక నేదురుమల్లి బంగ్లాలో సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, నేదురుమల్లి అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌జేఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీనియర్ నేత చెలికం శంకరరెడ్డి, కన్వీనర్ ఢిల్లీ బాబు, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎన్.వెంకటేశ్వరరావు, న్యాయవాది కోటేశ్వరరావు, సి.హరికృష్ణ, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగ నియోజకవర్గ అధ్యక్షురాలు డి.రాధమ్మ, మున్సిపల్ వైస్‌చైర్మన్ బాలయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గూడూరులో..

గూడూరు: మండలంలోని గొల్లపల్లిలోని వెందోటి సౌజన్యారెడ్డి స్కూల్లో మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేదురుమల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నేదురుమల్లి సేవలు మరువలేనివి

సైదాపురం: స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని సోమవారం నేదురుమల్లి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జేసీఎస్ కన్వీనర్ మన్నారపు రవికుమార్, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు.

లారీ ఓనర్స్ అసోసియేషన్ రద్దు

నాయుడుపేటటౌన్: నాయుడుపేట లారీ ఓనర్స్ అసోసియేషన్‌ను రద్దు చేసుకున్నట్లు అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు తిరుమల నాయుడు, అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం రెడ్డి సోమవారం వెల్లడించారు. మండల పరిధిలోని బిరదవాడ గ్రామ సమీపంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న అసోసియేషన్ కార్యాలయంలో అసోసియేషన్ నాయకులంతా కలసికట్టుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. రెండేళ్ల కిందట ప్రారంభించిన అసోసియేషన్ కొన్ని అనివార్య కారణాల వల్ల రద్దు చేసుకున్నట్లు వివరించారు. రద్దు చేసుకున్న అసోసియేషన్ పేరుతో మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న లారీల నుంచి రుసుం వసూలు చేయరాదని, ఏకగ్రీవంగా తీర్మానించుకున్నామని తెలిపారు. తమ సంస్థ పేరుతో వసూళ్లకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు చేపడుతామని చెప్పారు. ఈ విషయమై తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర రెడ్డికి, నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్ రెడ్డితో పాటు సూళ్లూరుపేట ఆర్డీఓ, స్థానిక తహసీల్దారు, ఇతర అధికారులకు, మేనకూరు సెజ్ పరిధిలోని పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులకు సైతం లిఖిత పూర్వకంగా వినతిపత్రాలను అందజేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో రద్దు చేసుకున్న అసోసియేషన్‌కు కార్యదర్శి అమవరపు సత్యం తదితరులు ఉన్నారు.

వేడుకగా నీలకంఠేశ్వరుడి కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

నాయుడుపేటటౌన్: మహాశివరాత్రి ఉత్సవాలను పుస్కరించుకుని నాయుడుపేట స్వర్ణముఖి నదీతీరాన వెలసిన ప్రసూనాంబ సమేత నీలకంఠేశ్వరుడి ఆలయంలో స్వామి, అమ్మవారి కల్యాణోత్సవం సోమవారం వేడుకగా జరిగింది. ఆలయ చైర్మన్ గూడూరు సుధీర్ రెడ్డి సారథ్యంలో ఉభయదారులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించగా, వేద పండితులు స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద వేలాదిమంది భక్తులకు అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ సభ్యులు, బాలాజీ గురుస్వామి, శివభక్త బృందం, ఉభయదారులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని అఖిలాండేశ్వరిదేవి సమేత జంబుకేశ్వరస్వామి ఆలయంలో కూడా స్వామి, అమ్మవారి కల్యాణాన్ని ఆర్యవైశ్య సంఘ నాయకుల ఆధ్వర్యంలో, బ్రాహ్మణవీధిలో ఉన్న అన్నపూర్ణేశ్వరి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి స్వామివారి నగరోత్సవం పట్టణ పురవీధుల్లో వేడుకగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ చైర్‌పర్సన్ పద్మజ, కరీంబాయి హరిబాబు మొదలియార్ దంపతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.